

చీనీ టన్ను రూ.17 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి. మార్కెట్‌కు 703 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టీబీ డ్యాంలో 81 టీఎంసీల నీరు
తుంగభద్ర జలాశయానికి బుధవారం ఉదయం 29,763 కూసెక్కుల వరదనీరు చేరింది. ప్రస్తుతం డ్యాంలో 81.540 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గరిష్టం/కనిష్టం
37.4°/22.5°
జిల్లా అంతటా బుధవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

టమాట రికార్డుల మోత

- కిలో గరిష్ట ధర రూ.160



అనంతపురం అగ్రికల్చర్: టమాట ధర రికార్డుల మోత మోగిస్తోంది. రైతు ఇంట లాభాలు కురిపిస్తోంది. కనీవిని ఎరుగని విధంగా మార్కెట్‌లో దూసుకెళుతోంది. ఈ సీజన్‌లో కిలో గరిష్ట ధర రూ.150తో ఇప్పటికే రికార్డు సృష్టించిన టమాట బుధవారం ఆల్‌టైం గరిష్ట సూచీని తాకింది. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి మండీలో కిలో టమాట గరిష్ట ధర రూ.160 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 240 టన్నుల సరుకు అమ్మకానికి రాగా వాటిని బహిరంగ వేలం వేశారు. కిలో గరిష్ట ధర రూ.160, కనిష్టం రూ.106, సరాసరి రూ.132 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయని చెప్పారు. ఎగుమతికి అనువుగా ఉన్న నాణ్యమైన టమాటకు వ్యాపారుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉండటంతో 15 కిలోల బాక్సు రూ.2 వేల నుంచి రూ.2,400 వరకు హాట్‌కేక్‌లా అమ్ముడుపోతోంది. ఈ నెలంతా గరిష్ట ధరలు కొనసాగే అవకాశం ఉందంటున్నారు.

పాఠశాలల వివరాలు నమోదు చేయండి

రాప్తాడురూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల వివరాలను ఈ నెల ఐదో తేదీలోగా htt ps;//ncpcr.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.సాయిరామ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ఉత్తర్వుల మేరకు ఈ వివరాలు అందించాల్సి ఉందని స్పష్టం చేశారు.

కళ్లకలకపై అప్రమత్తం చేయండి



రాప్తాడురూరల్: కళ్లకలక పట్ల విద్యార్థులను అప్రమత్తం చేయాలని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను డీఈఓ ఎం.సాయిరామ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాలు విస్తృతంగా కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. వాతావరణంలో జరిగే మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాఠశాల వేళల్లో విద్యార్థులు నీటిగుంటల వైపు వెళ్లకుండా చూడాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, ప్రహరీల వద్ద ఆటలాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నాడు–నేడు పనులు జరుగుతున్న స్కూళ్లలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రోజూ వంటగది, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. డెప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు ప్రత్యేక చొరవ తీసుకుని పర్యవేక్షించాలని సూచించారు.

నిర్లక్ష్యం.. ప్రాణాంతకం

- నాలుగు నెలల క్రితం ధర్మవరానికి చెందిన గర్భిణి కవితకు అనంతపురంలో అబార్షన్ చేయడంతో మృతిచెందింది. లక్ష్మీకాంతమ్మ అనే ప్రభుత్వ వైద్యురాలు తన ప్రైవేటు నర్సింగ్ హోంలో చేసిన నిర్వాకంతో ఈ మహిళ ప్రాణాలు విడిచింది.
- మొన్న శివచైతన్య నర్సింగ్ హోం వైద్యులు బాలింతరాలు నిండు ప్రాణాన్ని బలిగొన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర రక్తస్రావంతో మృతిచెందిన తీరు అందరినీ కలచివేసింది.
- నిన్న స్నేహలత ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పండంటి పసిబిడ్డ బయటి ప్రపంచం చూసేలోపే మృతి చెందింది. పసిబిడ్డకు ఒళ్లంతా కత్తిగాట్లతో ఉన్న తీరును చూసిన బాలింత బంధువులు కన్నీరు మున్నీరయ్యారు.

- మొన్న నర్సింగ్‌హోంలో బాలింత మృతి
- నిన్న ప్రైవేట్ ఆస్పత్రిలో పసికందు బలి
- ఠాగూర్ సినిమాను తలపిస్తున్న డాక్టర్ల తీరు
- అనవసరంగా స్కానింగ్‌లు.. వైద్య పరీక్షలు
- ఆర్‌ఎంపీల ద్వారా ప్రైవేట్ ఆస్పత్రులకు రోగుల రెఫర్

ప్రైవేటు ఆస్పత్రులకు డబ్బు జబ్బు పట్టుకుంది. రోగి పేద, ధనిక అనే తేడా ఏమీ లేదు. వారి వద్ద నుంచి డబ్బు ఎలా దండుకోవాలనే దానిపైనే శ్రద్ధ చూపుతున్నారు. అది ఎంతలా అంటే రోగి ఆరోగ్య పరిస్థితి ఉన్నది ఉన్నట్టు చెప్పకుండా.. వారిని ఎంతవరకు ఆర్థికంగా పీల్చిపిప్పి చేయాలో అంత వరకూ గొప్పగా వైద్యం చేస్తున్నట్లు నటిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు వైద్య సేవల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ రోగుల ప్రాణాలు బలిగొంటున్నారు. బాధిత కుటుంబాలకు తీరని శోకం మిగుల్చుతున్నారు.



జూలై 31న అనంతపురంలోని శివచైతన్య ఆస్పత్రిలో జరిగిన మాతృమరణంపై విచారణ చేస్తున్న డీఎంహెచ్‌ఓ యుగంధర్

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు...	
పాలీ క్లినిక్స్	6
20 పడకలలోపు ఆస్పత్రులు	113
21 నుంచి 50 పడకలలోపు	31
51 నుంచి 100 పడకల లోపు	16
101 నుంచి 200 పడకలు	4
200 పడకల కంటే ఎక్కువ	2
డయాగ్నస్టిక్స్ సెంటర్లు (బేసిక్)	81
హై ఎండ్ డయాగ్నస్టిక్	6

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం నగరంలోని ప్రైవేట్ నర్సింగ్‌హోంలు, కార్పొరేట్ ఆస్పత్రుల డబ్బు యావ రోగులను నిలువునా ముంచేస్తోంది. రోగి ఆస్పత్రిలో చేరి బయటకొచ్చే దాకా భయం భయంగానే బంధువులు కాపలా కాస్తున్న పరిస్థితి. ఏ ఆస్పత్రి తీరు చూసినా చిరంజీవి నటించిన ఠాగూర్ సినిమాలోని సీన్‌లే గుర్తుకొస్తున్నాయి. ఒకవేళ రోగి సురక్షితంగా బయటికొచ్చినా అతని కుటుంబం మాత్రం ఆస్పత్రికి కట్టే డబ్బుతో ఆర్థికంగా కుదేలవుతోంది. ఆస్పత్రులపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులు జలగల్లా మారాయి.

చివరి నిమిషం వరకు సస్పెన్సే..

జిల్లాలో ఏదో ఒకచోట వైద్యుల నిర్లక్ష్యంతో బాధితులు బలవుతూనే ఉన్నారు. రోగి పరిస్థితి చికిత్స మీద ఆధారపడి కాకుండా అదృష్టం – దురదృష్టం మీద ఆధారపడినట్టు అవుతోంది. చివరి నిమిషం వరకు పేషెంటు బంధువులకు ఆరోగ్య పరిస్థితి చెప్పరు. అంతా సస్పెన్సే. ఆఖరున 'మాతో కాదు. బెంగళూరుకో, హైదరాబాదుకో వెళ్లండి' అని అంటారు. అప్పటికే లక్షో, రెండు లక్షల రూపాయలో ఇన్‌పేషెంటు చార్జీలు వేయడంతో రోగి కుటుంబం సగం డీలాపడిపోయి ఉంటుంది. రోగిని బయటకు తీసుకెళ్లలేక, ఉన్న చోట ఉంచలేక నరకం చూస్తున్న దైన్యస్థితి.

ఛాతీపై స్టెతస్కోపు పెట్టకుండానే..

పేషెంటు చేరిన క్షణం నుంచే డబ్బు లాగడం మొదలవుతుంది. కనీసం స్టెతస్కోప్ ఛాతీమీద పెట్టకుండా స్కానింగులు, రక్తపరీక్షలతో డబ్బు లాగడం మొదలై చివరకు ఆపరేషన్‌తో ప్రక్రియ ముగుస్తుంది. ఇలా కార్పొరేట్ ఆస్పత్రుల నుంచి నర్సింగ్ హోంల వరకూ రోగిని పీల్చి పిప్పి చేస్తున్నాయి. ప్రసవానికి వెళ్లిన మహిళకు సిజేరియన్ చేసి కనిష్టంగా రూ.60 వేలు తీసుకుంటున్న పరిస్థితి. ఇక కార్డియాలజీ, న్యూరాలజీ వైద్యుల దగ్గరకు వెళితే ఎంఆర్‌ఐ స్కానింగ్ లేకుండా బయటికొస్తే రోగి అదృష్టమే అన్నట్టుంది. ఆరోగ్యశ్రీలో భాగంగా చికిత్స చేసినా రోగి నుంచి అదనంగా వసూలు చేస్తున్నారు.

రోగిని పంపిస్తే కమీషన్లు..

ఇటీవల కమీషన్ ఏజెంట్ల ప్రాబల్యం పెరిగింది. పల్లెలు, చిన్న చిన్న పట్టణాల్లోని ఆర్‌ఎంపీలు ఇక్కడి ఆస్పత్రులకు రోగులను రెఫర్ చేస్తున్నారు. ఇలా ఒక్కో ప్రైవేటు ఆస్పత్రి ఆయా ప్రాంతాలకు వెళ్లి ఆర్‌ఎంపీలను ఏజెంట్లుగా పెట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఒక్కో కేసుకు ఒక్కో రేటుతో రోగులను తెచ్చుకోవడం మార్కెటింగ్ వ్యూహంగా మారింది. చిన్న మండల కేంద్రానికి వెళ్లినా ఆర్‌ఎంపీకి అనంతపురంలోని నర్సింగ్‌హోంతోనో, డాక్టరుతోనో ఆర్థిక సంబంధాలు ఉన్నాయి. సగటున రోజూ పట్టణాలకు 10వేల మందికి పైగా ప్రైవేటు ఆస్పత్రులకు ఇలా ఏజెంట్ల ద్వారానే వస్తున్నట్టు అంచనా.

చట్టపరమైన చర్యలు తప్పవు

మాతా శిశువులకు మెరుగైన చికిత్స అందించాలి. వారికందించే సేవల్లో నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ఇప్పటికే ఓ గైనకాలజిస్టుపై కోర్టులో పిటిషన్ దాఖలు చేశాం.
– డాక్టర్ యుగంధర్, డీఎంహెచ్‌ఓ

9 నుంచి 'నా భూమి.. నా దేశం'

అనంతపురం రూరల్: ప్రజల్లో దేశభక్తిని పెంపొందించి, స్వాతంత్య్ర సమరయోధులు, దేశం కోసం పోరాడిన వీరులను గుర్తు చేసుకోవాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 9 నుంచి 29వ తేదీ వరకు పంచాయతీల్లో 'నా భూమి– నాదేశం' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు తెలిపారు. 9న పంచాయతీ కార్యాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో దేశం కోసం పోరాడిన వీరులను గుర్తు చేసుకుంటూ శిలాఫలకాలు ఏర్పాటు చేస్తామన్నారు. 10న పంచ ప్రాణ ప్రతిజ్ఞ, 11న వసుధకు వందనం, 14న వీరులకు వందనం, 15న జెండా వందన కార్యక్రమం, 16న మండలాలు, మునిసిపాలిటీల్లో రాష్ట్ర స్థాయి ఉత్సవం ఉంటుందన్నారు. 29న ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో ముగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

సెప్టెంబర్ వరకు చిరుధాన్యాల సాగుకు అవకాశం



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

కూడేరు: ఖరీఫ్‌లో వర్షాధారం కింద సెప్టెంబర్ నెలాఖరు వరకు చిరుధాన్యాల పంటలు సాగు చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. బుధవారం ఆమె కూడేరు రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం డీఏఓ విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వేరుశనగ సాధారణ విస్తీర్ణం 2,31,151 హెక్టార్లు కాగా.. ఇప్పటి వరకు దాదాపు 2 లక్షల హెక్టార్లలో సాగైనట్లు చెప్పారు. వేరుశగనకు ప్రత్యామ్నాయంగా ఆముదం, కంది, అలసంద, పెసలు, కొర్ర పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ నెల 15 వరకు కంది, ఆముదం, ఆ తర్వాత కొర్ర, పెసలు సాగు చేసుకోవచ్చన్నారు. నల్లరేగడి నేలలోనైతే శనగ, జొన్న సాగు చేసుకోవచ్చన్నారు. సెప్టెంబర్‌లో ఉలవ, అలసంద సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్‌పర్సన్ నిర్మలమ్మ, ఏడీ రవి, ఏఓ విజయకుమార్, ఏఈఓ శైలజ పాల్గొన్నారు.

డ్రోన్ల వ్యవ'సాయం'

- మొదటి విడతగా అక్టోబర్ నాటికి జిల్లాకు 25 డ్రోన్లు
- ఇప్పటికే 12 మందికి గుంటూరులో పైలట్ శిక్షణ పూర్తి
- రూ.10 లక్షల విలువైన డ్రోన్‌పై 50 శాతం దాకా రాయితీ
- అధునాతన పద్ధతిలో ఎరువులు, పురుగు మందుల పిచికారీ



డ్రోన్ ద్వారా పంటకు మందుల పిచికారీ

అనంతపురం అగ్రికల్చర్: వ్యవ'సాయం'లో నూతన శకానికి జగన్ సర్కారు నాంది పలికింది. ఇప్పటికే దేశంలో తొలిసారిగా గ్రామగ్రామానా ఆర్‌బీకేలతో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చింది. వ్యవసాయం, అనుబంధ శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వ ఫలాలు రైతు ముంగిటకే అందిస్తూ వడివడిగా ముందుకు సాగుతోంది. తాజాగా సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేస్తోంది. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుకు పెట్టుబడి ఖర్చులు తగ్గించి, సమయం, ఎరువులు, పురుగు మందులు వృథా కాకుండా 'కిసాన్ డ్రోన్ల'ను అందుబాటులోకి తెస్తోంది.

కీలకపాత్ర పోషించనున్న డ్రోన్లు..

జిల్లా వ్యాప్తంగా 451 రైతు భరోసా కేంద్రా (ఆర్‌బీకే)లు ఉన్నాయి. వీటి పరిధిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) ఏర్పాటు చేసి రైతు గ్రూపులకు 40 శాతం రాయితీపై కోరుకున్న ట్రాక్టర్లు, ఇతరత్రా ఆధునిక యంత్ర పరికరాలను ప్రభుత్వం అందిస్తోంది. అనుబంధంగా మల్టీపర్పస్ స్పెషాలిటీ సెంటర్ల పేరుతో గోదాముల నిర్మాణం చేపడుతోంది. తాజాగా వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ఎరువులు, పురుగు మందుల పిచికారీకి బాగా ఉపయోగపడే 'డ్రోన్లు' అందుబాటులోకి తెస్తోంది. వ్యవసాయ పద్ధతుల్లో ఇక నుంచి కిసాన్ డ్రోన్లు కీలకపాత్ర పోషించనున్నాయి.

డ్రోన్ వినియోగంపై శిక్షణ..

తొలి విడతగా జిల్లాకు 25 డ్రోన్లు మంజూరయ్యాయి. మలివిడతలో అవసరం మేరకు అదనపు కేటాయింపులు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. వీటిని కూడా ఆర్‌బీకేలకు అనుబంధంగా సీహెచ్‌సీల పరిధిలోకి తీసుకురానున్నారు. ఒక డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలుగా నిర్ణయించారు. పదోతరగతి, ఇంటర్ చదివిన రైతులకు 40 శాతం, బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు పూర్తయిన వారికి 50 శాతం రాయితీ కలిప్తూ.. మిగిలినది బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పించనున్నారు. తొలి విడతగా అక్టోబర్ నాటికి 25 డ్రోన్లను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. డ్రోన్ నిర్వహణకు ఎంపిక చేసిన రైతులకు విమాన పైలట్ల మాదిరిగా సమగ్ర వివరాలతో పాస్‌పోర్టు చేయించి గుంటూరు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో 12 రోజుల పాటు ఉచితంగా పైలట్ శిక్షణ ఇస్తున్నారు. జిల్లాకు సంబంధించి ఇప్పటికే 12 మందికి శిక్షణ పూర్తి చేశారు. మిగతా వారిని త్వరలోనే శిక్షణకు పంపనున్నారు.

మట్కా రాస్తూ చిక్కిన టీడీపీ నేత

- మరో ఇద్దరు నిర్వాహకుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: తెలుగుదేశం పార్టీ నేత ఒకరు మట్కా రాస్తూ పోలీసులకు చిక్కారు. తాడిపత్రి అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ బుధవారం వివిధ మట్కా స్థావరాలపై దాడులు నిర్వహించారు. మట్కా డాన్ కె.వి.రషీద్ సోదరుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ మట్కా రాస్తూ పోలీసులకు చిక్కాడు. అతనితో పాటు మరో ఇద్దరు మట్కా నిర్వాహకులు రాయచూర్ వీధికి చెందిన మకందర్ ఖాజా అలియాస్ లప్ప ఖాజా, శ్రీనివాసపురానికి చెందిన పాల మాబును అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.3 లక్షల నగదుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

తీరు మార్చుకోని అబ్దుల్ రజాక్...

పోలీసులక పట్టుబడిన అబ్దుల్ రజాక్ జేసీ సోదరులకు ప్రధాన అనుచరుడు. ప్రస్తుతం టీడీపీ పట్టణ అధ్యక్షునిగా కొనసాగుతున్నాడు. ఇతని సోదరుడు 'ఎల్లో' మట్కా డాన్ కె.వి.రషీద్. 2019 డిసెంబర్ 31న వైఎస్సార్ జిల్లా కడపలో ఎస్బీ సీఐగా ఉన్న హమీద్‌ఖాన్ తాడిపత్రిలోని మట్కా డాన్ రషీద్‌ను అరెస్టు చేసేందుకు వచ్చారు. ఆరోజు జేసీ సోదరుల (దివాకర్‌రెడ్డి– ప్రభాకర్‌రెడ్డి)ఆదేశాలతో ఎల్లో మట్కాడాన్ రషీద్, అతని అనుచరులు సీఐ హమీద్‌ఖాన్‌తో పాటు పోలీసులపై దాడి చేసి వాహనాన్ని కూడా తగులబెట్టిన విషయం తెలిసిందే. 2020లో కరోనా సోకి ఎల్లోడాన్ రషీద్ మృతి చెందారు. తన అన్న నుంచి సంక్రమించిన మట్కాను అబ్దుల్ రజాక్ నిర్వహిస్తూ వస్తున్నాడు. పలుమార్లు పోలీసులు అరెస్టు చేసినా అతనిలో మార్పు రాలేదు. బుధవారం జరిపిన దాడుల్లో మరోసారి అబ్దుల్ రజాక్ పోలీసులకు చిక్కాడు. దీంతో పోలీసులు రజాక్‌తో పాటు మకందర్ ఖాజా, పాల మాబుపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఈఆర్‌ఓల నియామకం

ఈఆర్‌ఓల నియామకం ఇలా..	
నియోజకవర్గం	ఈఆర్‌ఓ
రాయదుర్గం	జిల్లా యూత్ వెల్ఫేర్ అధికారి
ఉరవకొండ	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కెఆర్‌సీసీ
గుంతకల్లు	ఆర్డీఓ, గుంతకల్లు
తాడిపత్రి	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ) పీఏబీఆర్
శింగనమల	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ) హెచ్ఎన్ఎస్ఎస్-2
అనంతపురం అర్బన్	ఆర్డీఓ, అనంతపురం
కళ్యాణదుర్గం	ఆర్డీఓ, కళ్యాణదుర్గం
రాప్తాడు	డిప్యూటీ కలెక్టర్, హెచ్చెల్సీ

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు సవరణ–2024 కార్యక్రమం నేపథ్యంలో నియోజకవర్గాలకు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులను (ఈఆర్‌ఓ) ఎన్నికల సంఘం నియమించింది. ఇందుకు సంబంధించిన గెజిట్‌ను బుధవారం జారీ చేసింది. ఈఆర్‌ఓలు ఆయా నియోజకవర్గాలో సవరణ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాల్సి ఉంటుంది.

విదేశీ భాషలతో ఆకర్షణీయమైన కొలువులు



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న వీసీ రామకృష్ణా రెడ్డి

అనంతపురం: విదేశీ భాషలతో ఆకర్షణీయమైన కొలువులు పొందవచ్చని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విదేశీ భాషల్లో పీజీ డిప్లొమా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు బుధవారం ఎస్కేయూ వీసీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వీసీ మాట్లాడుతూ 2022–23 విద్యా సంవత్సరంలో వివిధ భాషల్లో 56 మంది విద్యార్థులు పీజీ డిప్లొమా కోర్సు పూర్తి చేశారన్నారు. వీరిలో జర్మన్ 19, స్పానిష్ 19, ఫ్రెంచ్ భాషల్లో 18 మంది డిప్లొమా కోర్సు పూర్తి చేసిన వారు ఉన్నారని పేర్కొన్నారు. ఎస్కేయూ విద్యార్థులకు ఆర్డీటీ ప్రత్యేకంగా జర్మన్, ఫ్రెంచ్, స్పానిష్ భాషల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి వీలుగా పీజీ డిప్లొమా కోర్సును అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆర్.నాగభూషణ రాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములు నాయక్, ఆర్డీటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన మురళి, కోర్సు కో–ఆర్డినేటర్ జోనస్, ఆర్డీటీ ఫారిన్ లాంగ్వేజెస్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ గీతాంజలి పాల్గొన్నారు.

రైతు ద్రోహి చంద్రబాబు

- నాడు ప్రాజెక్టులపై పూర్తి నిర్లక్ష్యం
- ఎన్నికలొచ్చేనరికి ఎక్కడా లేని ప్రేమ
- ప్రజలను మభ్య పెట్టేందుకు 'ప్రాజెక్టుల సందర్శన'
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం



ఆత్మకూరు వద్ద చంద్రబాబు హయాంలో 50 మీటర్లు తవ్వి వదిలేసిన కాలువను చూపుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: అధికారంలో ఉన్నపుడు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నారా చంద్రబాబు నాయుడు రైతు ద్రోహిగా మిగిలిపోయారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ధ్వజమెత్తారు. హంద్రీ–నీవా పథకానికి సంబంధించి ఆత్మకూరు వద్ద 1998లో చంద్రబాబు శిలాఫలకం వేసి, కేవలం 50 మీటర్ల వరకు కాలువ తవ్వి వదిలేసిన ప్రదేశాన్ని బుధవారం రైతులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ హంద్రీ–నీవా పథకానికి 1996లో ఉరవకొండ వద్ద ఒకసారి, 1998లో ఆత్మకూరు వద్ద మరొకసారి, 2017లో ఉరవకొండ వద్ద ఇంకోసారి, 2019 ఎన్నికలకు ముందు పేరూరు డ్యాంకు నీళ్లిస్తామని ఒకసారి చంద్రబాబు శిలాఫలకాలు వేశారన్నారు. వీటినంత మేర కాంట్రాక్టర్ల పేరుతో నిధులు పారించుకోవడం తప్ప.. పనులు పూర్తి చేసి నీళ్లు పారించిన పాపాన పోలేదని విరుచుకుపడ్డారు. ఆయన ఏ ప్రాజెక్టునూ కొత్తగా తేలేదని, ఏ ఒక్కటీ పూర్తి చేయనూ లేదని ఎద్దేవా చేశారు.

వ్యవసాయాన్ని పండుగలా మార్చిన వైఎస్సార్..

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యవసాయాన్ని పండుగలా మార్చారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. జలయజ్ఞం ద్వారా ప్రాజెక్టులు పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీరిచ్చి ఆయా ప్రాంతాలను సస్యశ్యామలం చేశారన్నారు. నాడు వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామంటే తీగల మీద బట్టలు ఆరేసుకుంటారా.. వ్యవసాయం దండగ అని చంద్రబాబు హేళన చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎన్నికలు వస్తుండటంతో రైతులపై కపట ప్రేమ చూపిస్తూ ప్రాజెక్టుల పరిశీలనకు వస్తున్నారని మండిపడ్డారు. 2014లో హంద్రీ–నీవా పెండింగ్ పనులను చంద్రబాబు కొనసాగించారు తప్ప చేసిందేమీ లేదన్నారు. అప్పటికే శ్రీశైలం నుంచి జీడిపల్లి రిజర్వాయర్‌కు నీళ్లు వచ్చాయని తెలిపారు. ఫేజ్–2లో భాగంగా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ వరకు దాదాపు 60 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ కానీ, పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌ను కానీ చంద్రబాబు పూర్తి చేయలేదని స్పష్టం చేశారు.

రూ.కోట్లల్లో దోపిడీ..

చంద్రబాబు తమకు అనుకూలంగా ఉన్న వారికి కాంట్రాక్టులు ఇచ్చుకుంటూ రూ.10 కోట్ల పనులను రూ.వంద కోట్లకు పెంచి నిధులు దోపిడీ చేశారని ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక రైతులు లక్షాధికారులు అయ్యారని.. అన్ని చెరువులకు నీరు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ నుంచి రొద్దం మండలం పెన్నా నదికి నీళ్లు వదిలి, అక్కడి నుంచి పేరూరు డ్యాంకు రూపాయి ఖర్చు లేకుండా నీళ్లు ఇచ్చామన్నారు.

నారా వారు అడుగు పెడితే నాశనమే..

'వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిశాయి. ప్రస్తుత ఖరీఫ్‌లో విత్తనాలు సాగు చేసే ముందు లోకేష్ యువగళం పేరిట రాయలసీమలో పాదయాత్ర చేశాడు. ఆ యాత్ర సాగినన్ని రోజులు చుక్క కూడా వర్షం పడలేదు. యాత్ర రాయలసీమ దాటాక వర్షం కురిసింది. విత్తనాలు విత్తుకున్న రైతులకు ఇప్పుడు చంద్రబాబు వస్తున్నాడంటే మళ్లీ భయం పుట్టుకుంది. చంద్రబాబు వస్తే వర్షాలు రావని, నారా కుటుంబం అడుగు పెడితే నాశనమే' అని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలను మభ్య పెట్టేందుకే చంద్రబాబు ప్రాజెక్టుల పరిశీలన పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఉపసర్పంచ్ శివారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, అంజినప్ప, వన్నూరప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నర్సరీలకు అనుమతి తప్పనిసరి



నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారులు


కంబదూరు: చట్ట ప్రకారం నర్సరీల నిర్వహణకు అనుమతులు తీసుకోవడంతో పాటు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని నిర్వాహకులకు జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి సూచించారు. ఉద్యాన సహాయ సంచాలకుడు నరసింహరావుతో కలసి బుధవారం కంబదూరు మండలంలోని నర్సరీలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు నర్సరీ చట్టం 2010పై అవగాహన కల్పించారు. రైతులకు నాసిరకం పైరు విక్రయించినా, టమాట, మిరప పైర్లను అధిక ధరకు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కంబదూరు ఉద్యాన అధికారి గౌసియా పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

గుత్తి రూరల్: మండలంలోని తురకపల్లిలో చోటు చేసుకున్న హత్య కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు గుత్తి పోలీసులు తెలిపారు. బీడీ కట్ట అప్పుగా తీసుకునే అంశంపై మంగళవారం తురకపల్లిలో చిరంజీవి, కిరాణా దుకాణం యజమాని రవి మధ్య గొడవ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో రవి తన తండ్రి మస్తాన్, కుమారుడు సాయికుమార్‌తో కలసి చిరంజీవిని తోసేయడంతో అతను మెట్లపై పడి తీవ్రంగా గాయపడి, అనంతపురంలోని ఆస్పత్రికి చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిరంజీవి తండ్రి మాణిక్యం ఫిర్యాదు మేరకు రవి, మస్తాన్, సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట్రామిరెడ్డి తెలిపారు.

బాబు పాలనలో కరువు దరువు

- 14 ఏళ్లలో 11సార్లు దుర్భిక్ష పరిస్థితులు
- అట్టర్‌ఫ్లాప్‌గా మారిన రెయిన్‌గన్ల షో
- పాతాళానికి భూగర్భ జలాలు
- కోలుకోలేని విధంగా పంట నష్టం



అనంతపురం అగ్రికల్చర్: చంద్రబాబు పాలనలో వరుణుడు ముఖం చాటేస్తాడు. ఇందుకు అప్పట్లో ప్రకటించిన కరువు మండలాలే ప్రత్యక్ష నిదర్శనం. ఏటా సగం లోటు వర్షం, రూ.వేల కోట్ల పంట నష్టం, బతుకుదెరువు కోసం లక్షలాది మంది రైతులు, కూలీలకు తప్పని వలసలు, అప్పుల నుంచి బయటపడే మార్గం కానరాక ఆత్మహత్యలకు పాల్పడడం నిత్యకృత్యంగా ఉండేవి. భూగర్భ జలాలు 20 నుంచి 25 మీటర్ల మేర అత్యంత కనిష్ట స్థాయికి పతనం కావడంతో వ్యవసాయ, ఉద్యాన రైతులు కన్నీరుపెట్టారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్‌తో ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతులకు చిల్లర విదిల్చేది. అనంతపురం జిల్లాను చూసి కరువే భయపడేలా చేస్తానంటూ బీరాలు పలికిన చంద్రబాబు.. 2016లో రెయిన్‌గన్లతో హడావిడి చేసి అభాసుపాలయ్యారు. ఆయన 14 ఏళ్ల పాలనలో 1998, 2000, 2017 మినహా మిగిలిన 11 సార్లూ కరువు విలయతాండం చేసింది.

చెప్పుకునేందుకు ఒక్కటి కూడా లేదు..

సొంత మామను వెన్నుపోటు పొడిచి 1995 సెప్టెంబర్ 1న దొడ్డిదారిన సీఎం పీఠం ఎక్కిన చంద్రబాబు అప్పటి నుంచి కల్లబొల్లి కబుర్లతో 2004 మే నెల వరకు తొమ్మిదేళ్లు ఏకధాటిగా రాష్ట్రాన్ని పాలించారు. ఆ తర్వాత రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ లాంటి ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి 2014 నుంచి 2019 వరకు ఐదేళ్లు సీఎంగా పనిచేశారు. ఇలా 14 సంవత్సరాలు పాలించినా... చెప్పుకునేందుకు ఒక్క మంచి కార్యక్రమం కూడా లేకపోవడం గమనార్హం.



చంద్రబాబు హయాంలో పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద ఎండిన చీనీ చెట్లు (ఫైల్)



మేత లేక కబేళాలకు అమ్ముకునేందుకు అప్పట్లో అనంతపురంలోని మార్కెట్ యార్డులో సంతకు తీసుకువచ్చిన కాడెద్దులు (ఫైల్)

2014-2018 మధ్య చంద్రబాబు హయాంలో పంటల బీమా పరిహారం ఇలా...

సంవత్సరం	రైతులు కట్టిన ప్రీమియం	అందిన పరిహారం	రైతులసంఖ్య
2014-15	రూ.14.09 కోట్లు	రూ.25.61 కోట్లు	47,627
2015-16	రూ.115.06 కోట్లు	రూ.109.66 కోట్లు	1,85,194
2016-17	రూ.44.64 కోట్లు	రూ.419.10 కోట్లు	5,07,658
2017-18	రూ.72.10 కోట్లు	రూ.159.70 కోట్లు	3,10,115
2018-19	రూ.80.02 కోట్లు	--	--
ఐదేళ్లు	రూ.325.91 కోట్లు	రూ.714.07 కోట్లు	10,50,594

జగన్ పాలనలో ఒక్క పైసా ప్రీమియం కట్టించుకోకుండా రైతులకు చెల్లించిన పంటల బీమా ఇలా....

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	పరిహారం
2019-20	2,46,649	రూ.266.42 కోట్లు
2020-21	2,05,291	రూ.362.25 కోట్లు
2021-22	4,04,461	రూ.855.55 కోట్లు
2022-23	2,65,114	రూ.370.58 కోట్లు
నాలుగేళ్లలో	11,21,515	రూ.1,854.80 కోట్లు

బాబును నమ్మని ప్రజలు..

చంద్రబాబు హయాంలో అభివృద్ధి వందేళ్లు వెనక్కు మళ్లింది. పచ్చమీడియాను అడ్డుపెట్టుకుని ఎదుటి పార్టీలపై కుట్ర కుతంత్రాలు పన్నడమే తప్ప నమ్ముకున్న ప్రజలకు మేలు చేస్తామనే ఆలోచన చేయకపోవడాన్ని గ్రహించిన జనం 'నిన్ను నమ్మం' బాబూ అంటున్న పరిస్థితి జిల్లాలో ఉంది. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నవరత్నాలను 99 శాతం అమలు చేస్తూ అభివృద్ధి సంక్షేమంతో దూసుకుపోతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారును ఎలాగైనా ఇబ్బందుల్లోకి నెట్టేందుకు దుష్ప్రచారంతో ముందుకు సాగుతున్న చంద్రబాబు ధోరణిని జనం చీదరించుకుంటున్నారు.

ఉచిత బీమాతో రైతులకు అండగా..

చంద్రబాబు హయాంలో 2014–15 నుంచి 2018–19 మధ్య ఐదేళ్లలో పంటల బీమా కింద రూ.714 కోట్లు పరిహారం ఇచ్చినా... అందులో రైతుల నుంచి ప్రీమియం రూపంలో రూ.326 కోట్లు దండుకున్నారు. వాస్తవానికి బాబు హయాంలో రైతులకు దక్కిన పరిహారం కేవలం రూ.388 కోట్లు మాత్రమే. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఈ నాలుగేళ్లలో 11.21 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.1,855 కోట్లు బీమా పరిహారం నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ అయింది. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మేలు జరిగినట్లు రైతులు ఇప్పటికీ గట్టిగా చెబుతారు. అంతకు మించి అన్నట్లుగా... ఇపుడు వైఎస్ జగన్ హయాంలో గ్రామ గ్రామాన ఆర్‌బీకే వ్యవస్థకు శ్రీకారం చుట్టి... వివిధ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తుండటంతో రైతు పయనం సాఫీగా సాగుతోంది.

ప్రెస్ అకాడమీ చైర్మన్ రేపు రాక

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈనెల 4న జిల్లాకు విచ్చేయనున్నారు. ఆ రోజు రాత్రికి అనంతపురం చేరుకుంటారు. 5వ తేదీ ఉదయం 10 గంటలకు మీడియాతో మాట్లాడతారు. స్థానికంగా జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



పదోన్నతుల ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులతో గిరిజమ్మ, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి

అనంతపురం సిటీ: ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతినిస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. జిల్లా పరిషత్ పరిధిలోని పంచాయతీరాజ్, పీఐయూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ సీఈఓ భాస్కర్‌రెడ్డితో కలసి బుధవారం ఆమె ఉత్తర్వులు అందజేసి, మాట్లాడారు. పాతికేళ్లుగా ఉద్యోగుల పదోన్నతులను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే దశల వారీగా అందరికీ పదోన్నతులు కల్పించడం గర్వంగా ఉందన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన ఉద్యోగులు గిరిజమ్మను సత్కరించారు.

'పోలీసుశాఖ ప్రతిష్ట పెంచండి'



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: పోలీసు శాఖ ప్రతిష్ట పెంచేలా విధులు నిర్వర్తించాలని హోంగార్డులకు ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. హోంగార్డుల సమస్యల పరిష్కారానికి స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో బుధవారం నిర్వహించిన దర్బార్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వృత్తిపరంగా హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ శాఖకు హోంగార్డుల సేవలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. పిల్లల చదువు, కుటుంబావృద్ధి విషయాల్లో రాజీ పడకూడదన్నారు. ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగించాలన్నారు. యూనిట్ పోలీసు ఆసుపత్రి, క్యాంటీన్, పోలీస్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు, పోలీసు డిజిటల్ లైబ్రరీల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కర్నూలు రీజియన్ హోంగార్డుల కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, హోంగార్డు విభాగం డీఎస్పీ లక్ష్మణ కుమార్ పాల్గొన్నారు.

ఏపీఎల్‌కు 14 మంది ఎంపిక

- అత్యధిక ధర పలికిన గిరినాథరెడ్డి
- రూ.6.1 లక్షలతో కొనుగోలు చేసిన రాయలసీమ కింగ్స్
- రూ.4.8 లక్షలతో రెండో స్థానంలో డీబీ ప్రశాంత్

అనంతపురం: విశాఖపట్నం వేదికగా ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకూ జరిగే ఆంధ్రా ప్రీమియర్ లీగ్–2 (ఏపీఎల్)కు అనంతకు చెందిన 14 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించి క్రీడాకారుల వేలం ప్రక్రియ బుధవారం వైజాగ్ నిర్వహించారు. రాష్ట్రంలోనే అత్యధిక క్రీడాకారులు ఎంపికైన జిల్లాల జాబితాలో తొలుత విశాఖ ఉండగా, రెండో స్థానం అనంతకు దక్కింది. ఇందులో 12 మంది ఆర్డీటీలో శిక్షణ పొందిన వారే కావడం గమనార్హం. ఏపీఎల్‌లో చోటు దక్కించుకున్న వారిని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్ అభినందించారు.

ఏపీఎల్‌కు ఎంపికైన క్రీడాకారులు వీరే..

క్రీడాకారుడు	జట్టు	వేలంలో పాడిన మొత్తం
పి.గిరినాథరెడ్డి	రాయలసీమకింగ్స్ (కెప్టెన్)	రూ.6.1 లక్షలు
డీబీ ప్రశాంత్‌కుమార్	వైజాగ్ వారియర్స్	రూ.4.8 లక్షలు
సోయబ్‌మహమ్మద్ ఖాన్	బెజవాడ టైగర్స్	రూ.3.6 లక్షలు
ఎం.రాజకుళ్లాయప్ప	రాయలసీమ కింగ్స్	రూ.3.1 లక్షలు
బి.సంతోష్‌కుమార్	బెజవాడ టైగర్స్	రూ.1 లక్ష
ఎంకే దత్తారెడ్డి	కోస్టల్ రైడర్స్	రూ.1 లక్ష
జి.మల్లికార్జున	గోదావరి టైటాన్స్	రూ.1 లక్ష
జి.దీపక్	కోస్టల్ రైడర్స్	రూ.1 లక్ష
పి.అర్జున్‌టెండూల్కర్	వైజాగ్ వారియర్స్	రూ.1 లక్ష
బి.వినయ్‌కుమార్	రాయలసీమ కింగ్స్	రూ.50 వేలు
జి.సంపత్‌కుమార్	రాయలసీమ కింగ్స్	రూ.50 వేలు
ఎస్.కమిల్	గోదావరి టైటాన్స్	రూ.25 వేలు
కేహెచ్ వీరారెడ్డి	రాయలసీమ కింగ్స్	రూ.25 వేలు
చైత్ర వర్ధన్	రాయలసీమ కింగ్స్	రూ. 25 వేలు



గిరినాథరెడ్డి



డీబీ ప్రశాంత్‌కుమార్

తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయండి

అనంతపురం క్రైం: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతను చైతన్య పరచాలని, ఈ ప్రక్రియ ఈ నెల 7వ తేదీ వరకూ కొనసాగాలని వైద్యాధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ ఆదేశించారు. బుధవారం ఉదయం తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారులతో ఆయన మాట్లాడారు. అత్యవసర సమయంలో గర్భినులను ఆస్పత్రులకు తరించాల్సి వస్తే అందుబాటులో ఉన్న 102 వాహనాలను వినియోగించుకోవాలని సూచించారు. గర్భిణులకు హైపటైటీస్ వ్యాధికి సంబంధించి పరీక్షలు నిర్వహించేలా చూడాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో మూడు కాన్పులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ముఖ హాజరు మూడుసార్లు ఆలస్యంగా నమోదు చేస్తే ఉద్యోగి ప్రమేయం లేకుండానే ఒక రోజు సెలవుగా పరిగణిస్తామన్నారు. ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది హాజరును ప్రతి నెలా 21లోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం నిధులను ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ అనుపమ జేమ్స్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ హర్ష, డాక్టర్ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు. అనంతరం తన చాంబర్‌లో ల్యాబ్ టెక్నిషియన్లతో డీఎంహెచ్‌ఓ సమావేశమై మాట్లాడారు. పీహెచ్‌సీల్లో చికిత్సకు వచ్చే జ్వరపీడితులకు రక్త పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. డెంగీ పాజిటివ్ నిర్ధారణ అయితే రోగి సీరం సేకరించి జిల్లా కేంద్రంలోనికంటైనల్ సర్వైలెన్స్ ల్యాబ్‌కు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చెన్నకేశవులు, జిల్లా మలేరియా అధికారి ఓబులు, తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

'పుడా' వైస్ చైర్మన్‌గా బండి శేషన్న

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా ధర్మవరం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న (ఎఫ్ఏసీ)ను నియమిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన నరేష్ కృష్ణ సెలవులో వెళ్లారు. ఇటీవలే ఆయన్ను చిలమత్తూరు ఎంపీడీఓగా బదిలీ చేశా రు. ఈ నేపథ్యంలో పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ స్థానం ఖాళీ కాగా, బండి శేషన్నను నియమించారు.

'108'లో ప్రసవం



నవజాత శిశువును చూపుతున్న ఈఎంటీ రాజేశ్వరి



శిశువును అందిస్తున్న ఈఎంటీ అనిల్‌కుమార్

ఉరవకొండ/వజ్రకరూరు: వేర్వేరు ప్రాంతాల్లో నిండు గర్భిణులను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే 108 వాహనంలో ప్రసవాలు జరిగాయి. వివరాలు.. ఉరవకొండ మండలం వ్యాసాపురం గ్రామానికి చెందిన నిండు గర్భిణి అంజలికి బుధవారం మధ్యాహ్నం పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని అంజలిని తీసుకుని ప్రభుత్వాస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పైలెట్ మహమ్మద్ రఫీ సాయంతో ఆమెకు ఈఎంటీ రాజేశ్వరి పురుడు పోశారు. పండంటి మగబిడ్డకు అంజలి జన్మనిచ్చింది. అనంతరం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో తల్లీబిడ్డను చేర్చారు. నవజాత శిశువు మూడు కిలోల బరువుతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నాడని వైద్యులు తెలిపారు. అలాగే వజ్రకరూరు మండలం వెంకటాంపల్లికి చెందిన గర్భిణి సుప్రజను కాన్పు కోసం గుంతకల్లులోని ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా పందికుంట ప్రసవమైంది. పండంటి మగబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ అనిల్‌కుమార్, పైలెట్ రమేష్ తెలిపారు.

దివ్యాంగులకు అండగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ

- కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా రెండు నెలల వేతనం విరాళం



రూ.1.75 లక్షల చెక్కును విరాట్ చేతుల మీదుగా అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి... దివ్యాంగులకు అండగా నిలిచారు. తన రెండు నెలల జీతం రూ.3.50లక్షలను బధిరులకు విరాళంగా అందజేశారు. వివరాలు.. ఎమ్మెల్యే పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి దంపతుల కుమారుడు ఆలూరి విరాట్ పుట్టిన రోజును బుధవారం బీకేఎస్‌లోని ఆర్డీటీ బధిరుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కుమారుడు పుట్టిన రోజు వేడుకను పురస్కరించుకుని ఏటా పేదలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. కొర్రపాడు పంచాయతీలోని గ్రామాలను దత్తతకు తీసుకుని మొక్కల పెంపకం, ఉచిత అంబులెన్స్ సేవలు, ఎస్ఆర్ఐటీ కళాశాలలో బర్డ్ పార్కు, కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటు, శింగనమల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఆలూరి విరాట్ పేరుపై ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు, పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు, నూతన దుస్తుల పంపిణీ, ఏటా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలతో పాటు, స్టడీ మెటీరియల్ పంపిణీ, నార్పల పీహెచ్‌సీకి సిటీ స్కానింగ్ మిషన్, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సహాయకులకు షెడ్డు నిర్మాణం తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. నిరుపేద దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి ఆర్డీటీ చేపట్టిన కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. తమ వంతుగా దివ్యాంగులకు తన రెండు నెలల వేతనాన్ని అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే పద్మావతి ప్రకటించారు. ఇందులో భాగంగా తన ఒక నెల జీతం రూ.1.75 లక్షలను చెక్ రూపంలో ఆర్డీటీ బధిరుల పాఠశాల విద్యార్థులకు అందజేశారు. మరో నెల జీతం రూ.1.75 లక్షలను ప్రభుత్వ ఆధ్వర్యంలోని వికలాంగ విద్యా సంస్థకు అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం 230 మంది విద్యార్థులకు నూతన దుస్తులు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, కార్యకర్తలు, ఆర్డీటీ సిబ్బంది, బధిర విద్యార్థులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో రక్తహీనత దూరం

ఉరవకొండ: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌తో బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత దూరమవుతుందని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి తెలిపారు. బుధవారం స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నోడల్ ఆఫీసర్ వనజాక్షితో కలసి సంపూర్ణ పోషణ పథకాన్ని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో వంట నూనె, 13 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు, రెండు కిలోల రాగిపిండి, కిలో బియ్యపు అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశనగ చిక్కీలు, 250 గ్రాముల ఎండు ఖర్జూరం ఉంటాయన్నారు. అలాగే మూడో శుక్రవారం 12 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు అందజేస్తారన్నారు. అనంతరం కిట్లను గర్భిణులు, బాలింతలకు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజమ్మ, నాగమణి, జ్యోతి, శ్వేతనాగు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ రెసిడెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్రైం: సీనియర్ రెసిడెంట్ స్పెషలిస్టు వైద్యుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తులను అనంతపురం వెబ్‌సైట్ www.ananthapuramu.ap. gov.inలో అందుబాటులో ఉంచారు. వీటిని అర్హులైన వైద్యులు డౌన్‌లోడు చేసుకుని, భర్తీ చేసి ఈ నెల 5న సాయంత్రం 5 గంటల్లోపు వైద్య కళాశాలలో అందజేయాలి. ఈ నెల 7న వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఇంటర్వ్యూ రోజున ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్స్ ప్రతులను తీసుకెళ్లాలి.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

అనంతపురం సిటీ: ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రాష్ట్ర ఉర్దూ అకాడమీ, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ (డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్) ఇవ్వనున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి షేక్ మహమ్మద్ రఫీ బుధవారం తెలిపారు. పదో తరగతి పాసై 40 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు మైనారిటీ సహా ఇతర కులాల వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీలోగా అనంతపురంలోని ఉర్దూ అకాడమీ శిక్షణ క్షేంద్రం, సైఫుల్లా కాంప్లెక్స్, పాత ఊరు, అనంతపురం చిరునామాకు దరఖాస్తులు పంపవచ్చన్నారు. 8328028731, 73964 20266 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రికి వీల్‌చైర్ల అందజేత



ఆస్పత్రి అధికారులకు వీల్ చైర్లు అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం క్రైం: వికలాంగుల సౌకర్యార్థం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వీల్‌చైర్లు అందజేసినట్లు అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి రూ.28 వేలు విలువ చేసే మూడు వీల్ చైర్లు అందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వేంకటేశ్వర రావుతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. దాతలు చేదోడుగా నిలిస్తే రోగులకు మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో తమ సంస్థ ఆస్పత్రికి ఏ అవసరమొచ్చినా సహాయ సహకారాలందించడానికి సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

ఎస్పీని కలసిన డీఎస్పీ



ఎస్పీ శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దిశ డీఎస్పీ ఆంథోనప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావును దిశ డీఎస్పీ ఆంథోనప్ప బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ, ఎస్టీ సెల్ నుంచి దిశకు బదిలీ అయిన ఆయన మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఫిర్యాదులపై తక్షణం స్పందించి సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

రాచానపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా జయకృష్ణారెడ్డి



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న పీఏసీఎస్ సభ్యులు

రాప్తాడురూరల్: రాచానపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా రాచానపల్లికి చెందిన గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి, సభ్యులుగా కురుగుంటకు చెందిన బి.ఆదినారాయణ, కొడిమికి చెందిన బొమ్మన ఆదినారాయణను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవ్ చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వు ప్రతిని బుధవారం పీఏసీఎస్ సీఈఓ శ్రీనివాసులు చైర్మన్, సభ్యులకు అందజేశారు. అనంతరం వారు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తమకు అవకాశం కల్పించడంపై ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

పానీపూరి వ్యాపారిపై దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పాతూరులో పానీపూరి అమ్ముకుని జీవనం సాగిస్తున్న తనను నందకిషోర్ అనే వ్యక్తి ఇబ్బంది పెడుతున్నాడంటూ ఖలీబ్‌సాబ్ బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నందకిషోర్ తప్పతాగి పలుమార్లు దాడి చేశాడని తెలిపాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రెడ్డెప్ప తెలిపారు.

పింగళి వెంకయ్య సేవలు అమూల్యం



వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ

అనంతపురం: జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య సేవలు అమూల్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి అన్నారు. త్రివర్ణ పతాకం అందరి గుండెల్లో చిరస్థాయిగా ఉండడానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. భావితరాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయులను స్మరించుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం గ్రంథాలయంలో పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు వి.సుబ్బరత్నమ్మ, ఉప గ్రంథాలయాధికారి ఇంతియాజ్ అహమ్మద్, జీఎం బాషా పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం, రాప్తాడు: పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న సీడీపీఓ ధనలక్ష్మి

అనంతపురం సెంట్రల్: గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. బుధవారం ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని బుడ్డప్పనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఇంటి వద్దకే సరుకులు (టీహెచ్‌ఆర్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీడీపీఓ లలిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోషక లోపం లేని సమాజం నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో కోతలు పెట్టి భారం తగ్గించుకుంటే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ఈ ప్రభుత్వం వీలైనంత ఎక్కువ మంది లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 2,302 అంగన్‌వాడీ కేంద్రాల్లో 18,980 మంది గర్భిణులు, 16,556 మంది బాలింతలకు లబ్ధి చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, ఆర్డీఓ మధుసూదన్, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ లలిత, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, అబుసలెహా పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీపీ అంజలి, సీడీపీఓ కవితాదేవి తెలిపారు. బుధవారం స్థానిక సీడీపీఓ కార్యాలయంలో టేక్ హోమ్ రైస్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్హులైన గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, ఎంపీడీఓ గంగావతి, ఈఓఆర్డీ అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీడీపీఓ ధనలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. గతంలో ఇంటికే అందజేసిన ఈ సరుకులు సక్రమంగా వినియోగానికి నోచుకోలేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే వండి, వడ్డించే విధానాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. పలు కారణాలతో గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి తిని వెళ్లే వారి సంఖ్య తగ్గిందన్నారు. దీంతో ప్రభుత్వం సర్వే చేపట్టి టేక్ హోం రేషన్ (టీహెచ్‌ఆర్) ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బోయ రామాంజినేయులు, వరలక్ష్మి, ఎంపీడీఓ సాల్మన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, అంగన్ వాడీ కార్యకర్తలు విజయలక్ష్మీ, భారతి, లక్ష్మీదేవి, ముత్యాలమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందుతుందని ఎంపీపీ హేమలత, ఆత్మకూరు సర్పంచ్ వరలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 587 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు.ఈనెల 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, సర్పంచ్ వరలక్ష్మి, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: మంచి పోషక విలువలు కలిగిన ఆహారంతోనే మహిళలు, పిల్లలకు సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందని తహసీల్దార్ రమాదేవి తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం కింద గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రశాంతి, జయంతి, సర్పంచ్ అంకె పరిమళ, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ముర్రుపాలే బిడ్డకు శ్రీరామరక్ష

రాప్తాడు: తల్లి ముర్రుపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్త యల్లమ్మ పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై చిన్మయనగర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిడ్డకు సక్రమంగా తల్లిపాలు అందించినప్పుడే ఆరోగ్యంగా పెరుగుతారన్నారు. బిడ్డ పుట్టిన అరగంట నుంచే బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఆరు నెలలు వరకూ బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని, ఏడో నేల నుంచి ఇంట్లో వండుకున్న ఆహార పదార్థాలను తల్లిపాలతో పాటు ఇవ్వాలని సూచించారు. గర్భిణులు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, గుండ్లు, చేపలు, పాలు, తదితర పౌష్టికాహారం తీసుకోవాన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సహాయకురాలు విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు నాగేంద్రమ్మ, వీరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోండి



మాట్లాడుతున్న మేయర్ వసీం సలీం

అనంతపురం క్రైం: కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకుని పరిపాలనపై పట్టు సాధించాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని 32వ డివిజన్‌లో నగరపాలక సంస్థ, లీప్ ఆర్గనైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ వివిధ అంశాలపై తప్పనిసరిగా నైపుణ్యం కల్గి ఉండాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో 800 నుంచి 1000 వరకూ మాత్రమే ఇళ్లు ఉంటాయన్నారు. వారందరికీ సేవలందించేందుకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా 1,30,000 మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. ఇతర రాష్ట్రాలు సైతం సచివాలయ వ్యవస్థను ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ.. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 1080 మంది సచివాలయ సిబ్బందికి 11 బ్యాచ్‌లుగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి బ్యాచ్‌లో 105 మందికి నాలుగు రోజుల పాటు శిక్షణ అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో వివిధ అంశాలను నేర్చుకోవాలన్నారు. కమిషనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ శిక్షణతో పాటు విధులను కొనసాగించాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు సాకే చంద్ర, అబూసలేహా కమల్‌భూషన్ పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి



తోపుదుర్తిలో పీర్లను ఎత్తుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రజలు ఎలాంటి సమస్యలు లేకుండా సంతోషంగా ఉండాలే చూడాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పీర్లస్వాములకు పూజలు చేశారు. బుధవారం మండలంలోని తోపుదుర్తి గ్రామంలో మొహర్రం వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పీర్ల స్వాములకు ప్రత్యేకంగా చదివింపులు చేయించిన ఎమ్మెల్యే.. పీర్ల స్వాములను ఎత్తుకున్నారు. ప్రతి ఒక్కరూ చల్లగా ఉండాలని దేవుడ్ని వేడుకున్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

రాప్తాడు: బొమ్మేపర్తి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ శెట్టిపల్లి వెంకటరెడ్డి బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబూ..జిల్లాకు రావొద్దు



ఆత్మకూరు వద్ద వర్షాలు లేక ఎండిన పంటను చూపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: చంద్రబాబు.. అనంత జిల్లాకు రావొద్దు అంటూ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు వేడుకున్నారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నన్ని రోజులు వర్షాలు పడక రైతులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ మధ్య కాలంలో లోకేష్ అనంత జిల్లాలో పాదయాత్ర చేశారు. అప్పటి నుంచి విత్తనాలు విత్తుకునే సమయం వరకూ వర్షాలు కురవలేదన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు విత్తనాలు సాగు చేశారని, మళ్లీ చంద్రబాబు వస్తే వర్షాలు పడవని రైతులు వాపోయారు. ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా గురువారం ఆత్మకూరుకు చంద్రబాబు రానున్నారు. బుధవారం ఆత్మకూరు వద్ద వర్షాలు లేక ఎండిపోయిన పంటను చూపుతూ చంద్రబాబు.. నువ్వు రావొద్దు అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, మండల కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, సింగంపల్లి సర్పంచ్ వెంకటేష్ నాయక్, గ్రామ సచివాలయ కన్వీనర్లు శ్రీరామ్, ఓబీ టైలర్ వెంకటేష్, నాయకులు అంజినప్ప, వన్నూరప్ప, వెంకటేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

రాప్తాడు: ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ మెరుగైన పాలన అందించాలని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సాల్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తొలుత వివిధ శాఖల అధికారులు తాము చేపట్టిన పురోగతి, లక్ష్యాలను వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

అధికారులపై ఆగ్రహం..

ఉపాధిహామీ ఈసీ మురళి మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 10,659 జాబ్ కార్డులు ఉండగా.. వాటిలో 9,039 కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయన్నారు. 3.20 లక్షల మందికి పని దినాలు కల్పించామన్నారు. ఈ ఏడాది 93 మంది రైతులు.. దాదాపు 285 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటుకున్నట్లు తెలిపారు. పథకాలు సక్రమంగా అందడం లేదని టీడీపీ ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కలు ఎవరికి ఇచ్చారు? చెట్లు నాటకనే బిల్లులు ఇచ్చారంటూ గొందిరెడ్డిపల్లి సర్పంచు మీడతల శీనయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండలు, గుట్టలో గుంతలు తవ్వి యర్ర మట్టి తోలుకుంటూ బిల్లులు చేసుకుంటూన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సభ్యత, సంస్కరం లేకుండా మాట్లాడుకోవడానికా ఇక్కడికి వచ్చిందేది అంటూ వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు టీడీపీ సర్పంచ్ మీడతల శీనయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నువ్వు కూడా యర్రమన్ను తోలే వారి దగ్గరి నుంచి రూ.లక్షలు వసూలూ చేశావంటూ వీడియోలు, పేపర్లలో కథనాలు వచ్చినాయని తెలిపారు. మేము డబ్బులు తీసుకోలేదని టీడీపీ సర్పంచ్ మీడతల శీనయ్య, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, ఎంపీటీసీ జాఫర్ ఖాన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు ఒక్కసారిగా టీడీపీ ప్రజా ప్రతినిధులపైకి దూసుకెళ్లారు. ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ లక్ష్మీ నరసింహాలు ప్రజాప్రతనిధులకు సర్ది చెప్పడంతో సమస్య సద్దు మణిగింది.

బళ్లారి రాఘవ జిల్లాకే గర్వకారణం



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, తదితరులు



బళ్లారి రాఘవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీఓ మధుసూదన్, తదితరులు

అనంతపురం కల్చరల్: బళ్లారి రాఘవ సేవలు ఆదర్శప్రాయమని, ఆయన జిల్లాలో జన్మించడం మన అదృష్టమని ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత అన్నారు. బుధవారం రాత్రి బళ్లారి రాఘవ 143వ జయంతి స్థానిక లలితకళాపరిషత్తులో ఘనంగా జరిగింది. వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర రెడ్డి, ఎల్కేపీ కార్యదర్శి గాజుల పద్మజ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణ తదితరులు ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. పౌరాణిక, సాంఘిక నాటకాల సీనియర్ నటులు చిదంబరరెడ్డి, లక్ష్మీనారాయణ, అరుణ్‌బాబు, డీ.ఏ.ఖాదర్‌బాషా తదితరులకు బళ్లారి రాఘవ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లలితకళాపరిషత్తు కార్యనిర్వాహక సభ్యులు సంగాల నారాయణ స్వామి, సోమిరెడ్డి, రాజ్‌కుళ్లాయప్ప, శ్రీనివాసులు, దయానంద్, వెంకటరామిరెడ్డి, ఉంగరాల శ్రీనివాసులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: తెలుగు నాటకరంగానికి ఎనలేని సేవలందించిన బళ్లారి రాఘవ చిరస్మరణీయులని ఆర్డీఓ మధుసూదన్ కొనియాడారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో బళ్లారి రాఘవ జయంతిని నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. బళ్లారి రాఘవ బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. నాటకరంగం అభివృద్ధికి విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీధర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, మేనేజర్లు పి.వి.దీపిక, కిరణ్ పాల్గొన్నారు.

అనంతకు చేరిన చంద్రబాబు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం రాత్రి అనంతకు వచ్చారు. స్థానిక ఎంవైఆర్ ఫంక్షన్ హాలుకు చేరుకున్న ఆయన రాత్రికి అక్కడే బస చేస్తారు. గురువారం ఉదయం మండల స్థాయి నేతలతో సమావేశం కానున్నారు. 10 గంటలకు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పేరూరు, గొల్లపల్లి రిజర్వాయర్‌లతో పాటు కియా పరిశ్రమను సందర్శించనున్నారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ చియ్యేడు కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయం, పండ్లతోటల పెంపకం, మధ్యాహ్న భోజన పథకం, పశువైద్యం, డెయిరీ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యుత్, గృహనిర్మాణం, తాగునీరు-పరిశుభ్రత తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు నిత్యం అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ పుల్లయ్య, ఇతర మండల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఓబుళపతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రాప్తాడురూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఇటీవల ఎన్నికైన కుమ్మరి ఓబుళపతి తెలిపారు. బుధవారం పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్‌యూపీపీ రాష్ట్ర నాయకుడు సి.ఎర్రిస్వామి, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మాచెర్ల రాజు, రజక సంఘం నాయకుడు బయన్న తదితరులు ఓబుళపతిని కలిశారు. దుశ్శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం ఓబుళపతి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకానికి ఎల్లప్పుడూ విశ్వాస పాత్రుడిగా ఉంటానన్నారు. పథకాలను పాఠశాలకు, ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థికి అందేలా పని చేస్తానన్నారు.

ఖాజీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఖాజీ జాహిద్ హుస్సేన్

అనంతపురం సిటీ: ఏపీ ప్రభుత్వ ఖాజీల అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఖాజీ జాహిద్ హుస్సేన్‌ను ఎంపిక చేశారు. బాలాజీ జిల్లా కేంద్రం తిరుపతిలోని మస్జీద్ అబుబకర్ షాదీఖానాలో ప్రభుత్వ ఖాజీల రాష్ట్ర స్థాయి సమ్మేళనం బుధవారం నిర్వహించారు. 26 జిల్లాలకు కమిటీలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఖాజీల అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా నగరానికి చెందిన ఖాజీ జాహిద్ హుస్సేన్‌ను ఎంపిక చేశారు. రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా తిరుపతి హాజీ సయ్యద్ షఫీ హాజరిని నియమించారు.

డయాలసిస్ బాధితుడికి పింఛన్ మాంజూరు

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన శీల్ల లక్ష్మీనారాయణకు ప్రభుత్వం కొత్తగా డయాలసిస్ పింఛన్ మంజూరు చేసింది. బుధవారం వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు బాధితుడికి రూ.10 వేల పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ చిరుతల నాగేంద్ర, సంక్షేమ సహాయకుడు వేణు, వలంటీర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక డీఎస్సీ పోస్టులు భర్తీ చేయండి



ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతితో మాట్లాడుతున్న అభ్యర్థులు

రాప్తాడురూరల్: ప్రత్యేక డీఎస్సీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి నిరుద్యోగ అభ్యర్థులు విన్నవించారు. బుధవారం ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రత్యేక ఉపాధ్యాయ కోర్సులు చదివిన అభ్యర్థులు వేల సంఖ్యలో ఉన్నారని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం ప్రాథమిక పాఠశాలలో 5:1 ఉన్నత పాఠశాలలో 15:1 నిష్పత్తిలో ప్రత్యేక టీచర్లు ఉండాలన్నారు. ప్రతి పాఠశాలలో సమ్మిళిత విద్యను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పోస్టులను భర్తీ చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక విద్య అభ్యర్థుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొగ్గుల సురేష్, ప్రధాన కార్యదర్శి తలారి అంజనయ్య, ఉప కార్యదర్శి బోయ ఓబులేసు, నాగఫణి, గంగాధర్, రాధమ్మ, సరోజ, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

ఓటరు సర్వే వేగవంతం చేయాలి

అనంతపురం క్రైం: ఓటరు జాబితా సర్వేను మరింత వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి బీఎల్‌ఓలను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థలో బీఎల్‌ఓలతో ఆమె సమావేశమయ్యారు. ఓటరు జాబితా సర్వేను నిర్లక్ష్యం చేసిన బీఎల్‌ఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించేది లేదన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, టీపీఓ శిరీష, ఆర్ఓలు సతీష్, సుజాత, ఆర్ఐ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణకిశోర్ సేవలు స్ఫూర్తిదాయకం



కృష్ణకిశోర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

అనంతపురం కల్చరల్: ఇటీవల మరణించిన జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకుడు జంపా కృష్ణకిశోర్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు టీవీరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక లెక్చరర్స్ కాలనీలో తెలుగు వెలుగు సంస్థ ఆధ్వర్యంలో జంపా కృష్ణకిశోర్ సంతాప సభ జరిగింది. ఆయన చిత్రపటానికి ఐక్యవేదిక నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేదిక ప్రతినిధులు టీవీరెడ్డి, విశ్రాంత ఆర్ఐఓ క్రిష్టప్ప, జేవీవీ నాయకులు తరిమెల రాజు తదితరులు మాట్లాడారు. దేహదానం చేసి ఆదర్శప్రాయంగా నిలిచిన కృష్ణకిషోర్ ఆదర్శాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అరుణోదయ కళాకారులు చంద్రప్ప, దావీదు, ఐక్యవేదిక నాయకులు బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.